క్లుప్తంగా

నేడు భట్టిప్రోలులో ఎన్నికల ప్రచారం

భట్టిప్రోలు: భట్టిప్రోలులో శుక్రవారం వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి పట్టణంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొంటారని కార్యాలయ సిబ్బంది గురువారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు యానాది సంఘీయుల ఆత్మీయ సమ్మేళనం

చెరుకుపల్లి: రేపల్లె నియోజకవర్గ యానాది సంఘీయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి యందేటి వెంకట సుబ్బయ్య చెప్పారు. యానాది సంఘీయులు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం ఉదయం 10 గంటలకు చెరుకుపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఈ ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి రాష్ట్ర ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గూండ సురేంద్ర పాల్గొని యానాది సంఘీయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని యానాది సంఘీయులు అంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చౌటూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పిట్టలవానిపాలెం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఇన్‌చార్జ్ ఎంపీపీ డి.సీతారామరాజు అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో ఎం.వి.రమణారావు గురువారం తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించటం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు



ప్రత్తిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ వి.సోమేశ్వరరావు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామానికి చెందిన బొడ్డు నరేష్ బోయపాలెంలో మద్యం విక్రయించేందుకు వెళుతూ, ఆటో కోసం మెయిన్ రోడ్డుపై వేచి ఉన్నాడు. పక్కా సమాచారం అందడంతో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. అతని వద్ద అక్రమంగా 180 ఎం.ఎల్. పది మద్యం బాటిళ్లను గుర్తించారు. ఈ మేరకు అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురువారం తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

ఫైర్ సిబ్బంది మాక్‌డ్రిల్

పొన్నూరు: పెట్రోల్ బంకులలో, వంట గ్యాస్ గోడౌన్‌లలో అగ్ని ప్రమాదాలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పొన్నూరు అగ్నిమాపక కేంద్రాధికారి కె. ప్రసాదరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శనలిచ్చారు. ప్రసాదరావు మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రమాదాలు సంభవించినపుడు జాగ్రత్తలు పాటించాలని, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

వైభవం...జల విహార తెప్పోత్సవం



తాడేపల్లిరూరల్ : విజయవాడ ఇంద్రకీలాద్రి ఉపాలయమైన సీతానగరం శ్రీమద్వీరాంజనేయ సమేత శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం సీతారాములకు జల విహార తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు గంగాపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థాన అర్చకులు, సిబ్బంది, ఈఈ ఎల్ రమ, ఏఈఓ జంగం శ్రీనివాసరావు, కె. శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపం..రహదారులు నిర్మానుష్యం

- రోజురోజుకూ పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలకు ఎండ తీవ్రతతో ముప్పు
- ఆరోగ్య సూత్రాలు పాటించడం శ్రేయస్కరం
- వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రామలక్ష్మి



నిర్మానుష్యంగా ఉన్న భట్టిప్రోలు బస్టాండ్

భట్టిప్రోలు: ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతల పెరుగుదలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 11 గంటలకే ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం 4 గంటలు దాటే వరకు ప్రజలు బయటకు రావడం లేదు. వేసవిలో సాధారణంగా ఎక్కువ మందిని ఇబ్బంది పాలు చేసేది వడదెబ్బ. తీవ్ర స్థాయిలో వడదెబ్బ తగిలితే ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంది. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో శరీర ఉష్ణోగ్రత 40.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువైనప్పుడు ఉష్ణోగ్రతను నియంత్రించే మెదడులోని కేంద్రం దెబ్బతినడం వల్ల వడదెబ్బకు గురవుతారు. భట్టిప్రోలులో బుధవారం 38 సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఈ నెల మధ్యభాగం నుంచి 40 డిగ్రీల పైబడి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని మెట్రోలాజికల్ అబ్జర్వర్స్ తెలిపారు.

వడదెబ్బకు కారణాలు

వేడిమి ఎక్కువగా ఉన్న చోట హెచ్చు శ్రమతో కూడిన పని చేస్తున్నప్పుడు ప్రతి గంటకు మూడు లేదా నాలుగు లీటర్ల నీరు చెమట రూపంలో శరీరం కోల్పోతుంది. శరీరం ఉప్పు కన్నా ఎక్కువ నీటిని కోల్పోతే వడదెబ్బ తగులుతుంది. 45 ఏళ్ల వయస్సు పైబడిన వారు, పసి పిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, గుండె జబ్బులు, అధిక రక్తపోటు ఉన్న వారు త్వరగా వడదెబ్బ బారిన పడతారు.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలితే శరీర ఉష్ణోగ్రత పెరగడం, నాడి వేగంగా కొట్టుకోవడం, తలనొప్పి, శరీరం పొడిబారడం, తడి ఆరిన నాలుక, ఫిట్స్, పాక్షిక, పూర్తి అపస్మారక స్థితిలోకి వెళతారు.

ఆరోగ్య సూత్రాలు పాటింపుతో ఉపశమనం



ప్రస్తుతం క్రమంగా పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో పగలు 10 గంటల తర్వాత ప్రజలు బయటకు రాకపోవడమే ఉత్తమం. అత్యవసర పరిస్థితులలో బయటకు రావాల్సివస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు జాగ్రత్తగా ఉండాలి. మాంసాహారానికి దూరంగా ఉంటూ తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవడం మంచిది.

–చావలి రామలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, వెల్లటూరు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఎక్కువగా నీరు, ద్రవ పదార్థాలను సేవించాలి
- సాధ్యమైనంత వరకు మిట్ట మధ్యాహ్నం ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన పళ్ల రసాలు త్రాగాలి. గొడుగును ఉపయోగించాలి. తెల్లని దుస్తులు, తలపై టోపీ లేదా రుమాలు ధరించాలి.
- ఆల్కాహాల్ సేవించడం వల్ల రక్తకణాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. ఇది విషమ పరిస్థితికి దారి తీస్తుంది.
- ఇంటి గదుల ఉష్ణోగ్రతలను తగ్గించడానికి కిటికీలు, తలుపులకు తెరలను వాడాలి. ఫ్యాన్లు, ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండీషనర్లు ఉపయోగించవచ్చు.
- ఎండలో పని చేయాల్సి వచ్చినప్పుడు ప్రతి 30 నిమిషాలకు ద్రవ పదార్థాలను తీసుకోవాలి.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లెరూరల్: మెగా లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేకూరేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సబ్ కోర్టు ప్రాంగణంలో మే 11న జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా పని చేయాలని కోరుతూ సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో గురువారం స్థానిక కోర్టు హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేయాలన్న ఉద్దేశ్యంతో న్యాయశాఖ ప్రతినెల లోక్ అదాలత్ నిర్వహిస్తోందన్నారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించేలా అధికారులు పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జగదీష్ కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ,, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ డీఐ తనిఖీలు

గుంటూరు ఎడ్యుకేషన్: నల్లచెరువులోని నగర పాలకసంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఖాసిం మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో సాధించిన మార్కులను ఈనెల 23లోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, ప్రగతి పత్రాలను త్వరితగతిన రూపొందించాలని సూచించారు. అదే విధంగా వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా, ప్రభుత్వ సూచనల మేరకు తప్పనిసరిగా రోజుకు మూడుసార్లు వాటర్ బెల్ మోగించి, మంచి నీరు తాగే విధంగా చూడాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థుల నమోదు కోసం చర్యలు చేపట్టాలని కోరారు.

శ్రీరాముని జీవితం నేటి తరానికి ఆదర్శం



పల్లెకోన రామాలయంలో పూజల్లో వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: శ్రీరామచంద్రుని జీవన విధానం నేటి తరానికి ఆదర్శ ప్రాయమని అందుకే భారత దేశంలో గ్రామ గ్రామాన, వాడవాడలా రామాలయాల నిర్మాణం చేసుకుని సీతా రాముల కల్యాణోత్సవాలు జరుపుతారని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ బాబు అన్నారు. శ్రీ రామనవమి వేడుకలు పురస్కరించుకుని మండలంలోని పల్లెకోనలో వేంచేసి యున్న శ్రీ సీతారాముల వారిని గురువారం దర్శించుకుని అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని సహపంక్తి భోజనం చేశారు. అశోక్‌బాబు మాట్లాడుతూ శ్రీ రాముడు ఏకపత్నీ వ్రతుడుగా ప్రజలంతా సుఖ శాంతులతో జీవించేలా సుపరిపాలన చేసిన ధీరోదాత్తుడని పేర్కొన్నారు. శ్రీ రాముని కల్యాణం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, పల్లెకోన, ఆళ్లమూడి, రాచూరు సర్పంచులు బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్, పెద్దిశెట్టి రాంబాబు, జయవరపు రాధాకృష్ణమూర్తి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు జస్వంత్ రాజ్, రెబ్బా మున్ని, పంతగాని బాలు, యేపూరి నాగు, పెద్దిశెట్టి వెంకటేశ్వరరావు, దావూరి నాగమల్లేశ్వరరావు, కనపర్తి శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి 'బొంతల' కృషి ఎనలేనిది

నెహ్రూనగర్: రజకుల సమస్యల పరిష్కారంలో బొంతల వెంకటేశ్వర్లు చేసిన కృషి మరువలేనిదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజకజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం అరండల్‌పేటలో వెంకటేశ్వర్లు 5 వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల సమస్యలు పరిష్కారం కావాలంటే సంఘటితంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు(వైకే) మాట్లాడుతూ పేద రజక కులంలో పుట్టి రజకులను చైతన్యం చేయంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన మహాసభ జాతీయ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్, బీసీ సంఘ నాయకులు శివయ్య, ఉమా మహేశ్వరరావు, రమాదేవి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మోగిన ఎన్నికల నగారా

- 25 వరకు నామినేషన్ల స్వీకరణ.. 26న పరిశీలన
- 29 వరకు ఉపసంహరణకు గడువు
- మే 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్
- నోటిఫికేషన్ విడుదలచేసిన రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్, ఏఆర్‌ఓ ఎం. పద్మజ



పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ షేక్ మహబూబ్‌బాషా

ప్రత్తిపాడు: ఎన్నికల గంట మోగింది. సార్వత్రిక సమరానికి కౌంట్‌డౌన్ స్టార్ట్ అయ్యింది. 2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ (ఫారం-1)ను ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆర్‌ఓ పి. శ్రీకర్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఎం.పద్మజలు విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీకర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలయ్యిందని, ప్రభుత్వ సెలవు దినాలు మినహా 25వ తేదీ వరకు ఉదయం పదకొండు గంటల నుంచి సాయంత్రం మూడు గంటల మధ్య నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. నామినేషన్ పత్రాలు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని, దాఖలు చేయాలనుకునే అభ్యర్థులు కార్యాలయం నుంచి పొందవచ్చని వివరించారు. అదే విధంగా 26వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదీ సాయంత్రం మూడు గంటల వరకు గడువు ఉంటుందని చెప్పారు. మే 13న పోలింగ్ జరుగుతుందని స్పష్టం చేశారు.

ఐదుగురు మాత్రమే..

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో అభ్యర్థితో పాటు కేవలం నలుగురిని మాత్రమే లోపలకు అనుమతించడం జరుగుతుందని ఆర్వో చెప్పారు. నామినేషన్ల సమయంలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా, శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసులతో చర్చించి పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాలతో వాస్తవ సమాచారంతో అఫిడవిట్‌ను సమర్పించాలన్నారు. వెంట ఏఆర్‌వో ఎం. పద్మజ పాల్గొన్నారు.

బందోబస్తు పరిశీలన..

ప్రత్తిపాడు రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద బందోబస్తును గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ షేక్ మహబూబ్‌బాషా గురువారం ఉదయం పరిశీలించారు. అభ్యర్థులతో పాటు ఎంత మందిని అనుమతించాలి? వంద మీటర్ల పరిధి.. బారికేడ్లు ఏర్పాటు.. తదితరాలను పరిశీలించారు. నిబంధనల అమలులో ఎలాంటి రాజీధోరణి, అలసత్వం వహించవద్దని సిబ్బందిని ఆదేశించారు. వెంట నోడల్ ఆఫీసర్, ప్రత్తిపాడు సీఐ నిసార్‌బాషా, ఎస్‌ఐ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిని ఓడించండి

కొరిటిపాడు(గుంటూరు): ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాతో భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ అంతర్జాతీయ, జాతీయ పెట్టుబడిదారులకు దాసోహం అంటున్న బీజేపీ సారధ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి పి.జె.జేమ్స్ పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ పార్టీ ప్రచార పత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేమ్స్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ సారధ్యంలోని ఎన్డీఏ కూటమి మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం పూర్తిగా రద్దుచేసే అవకాశాలు ఉన్నాయని, దేశంలో తదుపరి ఎన్నికలు జరగని పరిస్థితి కూడా ఏర్పడవచ్చని చెప్పారు. దివాలా కోరు బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఎన్డీఏ కూటమిని ప్రజలు ఓటు వేసి ఓడించాలని కోరారు. మార్చి 10న సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ కేంద్ర కమిటీ నాగపూర్‌లో జరిగిన ఫాసిస్టు వ్యతిరేక ప్రజా సదస్సులో భావ సారూప్యత కలిగిన అభ్యుదయ ప్రజాస్వామ్య శక్తులు, వర్గాలతో కలసి తమ ఓటును వ్యూహాత్మకంగా ఉపయోగించాలని ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ పోలిట్ బ్యూరో సభ్యుడు మనవ హరిప్రసాద్ ఆంధ్రప్రదేశ్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విడిపోయిన భార్యపై దాడి

తాడికొండ: విభేదాలతో విడిపోయిన ఓ భర్త, తన భార్యపై దాడిచేసిన ఘటన తాడికొండ మండలం మోతడకలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా ఎ కొండూరు మండలం, కృష్ణారావుపాలెం గ్రామానికి చెందిన బరోతు ధావా అదే ఊరికి చెందిన రూపను 15 ఏళ్ల కిందట పెళ్లి చేసుకున్నాడు. వీరికి అబ్బాయి, అమ్మాయి సంతానం. అయితే మనస్పర్థల కారణంగా ఇరువురూ ఎనిమిది నెలల క్రితం విడిపోయారు. కాగా గురువారం మోతడకలో బంధువుల వివాహానికి రూప వచ్చింది. ఆమె నిద్రిస్తున్న సమయంలో భర్త పచ్చడి బండతో తలపై దాడి చేశాడు. అప్రమత్తమైన స్థానికులు రూపను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు.

ఓటు వినియోగంతోనే దేశ భవిష్యత్తు

నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు



జంపనిలో ఓటుహక్కు అవగాహనపై నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న వసంతరాయుడు

వేమూరు: ప్రజలంతా ఓటు హక్కును సక్రమంగా వినియోగించు కోవాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు పిలుపునిచ్చారు. వేమూరు మండలంలోని జంపని గ్రామ కూడలిలో ఓటుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వజ్రాయుధమని అన్నారు. ఓటుతోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని కోరారు. నోటుకు ఆశపడి పవిత్రమైన ఓటును అమ్ముకోవడం నీచమైన చర్యగా అభివర్ణించారు. ఓటు పై ప్రజలను అవగాహన కలిగించేందుకు నినాదాలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నరసింహస్వామి సన్నిధిలో కోన పూజలు



అల్లూరు లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి

అల్లూరు(కర్లపాలెం): బాపట్ల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి గురువారం సతీ సమేతంగా పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో తన నామినేషన్ పత్రాలను ఉంచి పూజలు నిర్వహించారు. లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ముందుగా నామినేషన్ పత్రాలకు పూజలు చేసి నామినేషన్ వేసిన వారే విజయం సాధిస్తుండటంతో సెంటిమెంట్‌గా కోన రఘుపతి తమ నామినేషన్ పత్రాలకు పూజలు చేయించారు. పూజా కార్యక్రమంలో రఘుపతి సతీమణి రమాదేవి, కుమారుడు నిఖిల్, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ బాజీ, డి.సీతారామరాజు, కృపానందం, మండే విజయకుమార్, వారి శివారెడ్డి, బడుగు ప్రకాష్, కూసంపూడి దేవేంద్రరాజు, రామచంద్రరాజు తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన తప్పనిసరి

అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు



ఆర్టీసీ గ్యారేజ్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బాపట్ల టౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని గ్యాస్ గోడౌన్లు, పెట్రోలు బంక్‌లు, ఆర్టీసీ బస్టాండు, గ్యారేజీల్లో సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వేసవికాలంలో చిన్నపాటి అగ్ని ప్రమాదం జరిగినా అదుపుచేయటం కష్టంగా మారుతుందన్నారు. రెప్పపాటులో భారీ నష్టం జరిగే అవకాశం ఉంటుందన్నారు. గ్యాస్ గోడౌన్లు, పెట్రోల్ బంక్‌లు పరిసర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీవ్ర నష్టంతో పాటు ప్రాణాపాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. ఆయా కంపెనీల నిర్వాహకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దాం
–అగ్నిమాపకశాఖ అధికారి సాంబశివరావు

రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరికి అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని వివిధ పెట్రోలు బంకులు, గ్యాస్‌కంపెనీ గోడౌన్ల వద్ద గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెట్రోలు బంకుల వద్ద ధూమపానం చేయటం, సెల్‌ఫోన్ మాట్లాడటం వంటి చర్యలు చేయరాదన్నారు. గ్యాస్ గోడౌన్‌ల సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది నాగేశ్వరరావు, ఎస్.నాగేంద్రరెడ్డి, జీ.కోటేశ్వరరావు, వి.సుబ్బారావు, ఎం.జనార్ధనరావు, కేవీ సాయికృష్ణారెడ్డి, పి.హరిబాబు, బీ.వీరకుమార్, సీహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెలో హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వద్ద అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పలు చోట్ల వలంటీర్ల రాజీనామాలు



కనగాల సచివాలయంలో కార్యదర్శికి రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు



అమర్తలూరు సచివాలయంలో రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

చెరుకుపల్లి: మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగా కనగాల సచివాలయ పరిధిలోని 16 మంది వలంటీర్లు, నడంపల్లిలో 7 గురు, తుమ్మలపాలెంలో ముగ్గురు వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామాలు చేసి రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి తెనాలి వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఇప్పటి వరకు మండలంలో వివిధ సచివాలయాల నుంచి 142 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలు అందజేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసమూర్తి తెలిపారు. ప్రతి పక్షాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తాము ఎన్నికల ప్రచారం చేస్తున్నమంటూ తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వలంటీర్లు వాపోయారు.

25 మంది వలంటీర్లు రాజీనామా

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1, 2కు చెందిన వలంటీర్లు 25 మంది శుక్ర వారం రాజీనామా పత్రాలు అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి కుమార్ తెలిపారు. తమపై ఎన్నికల కమిషన్ అనేక ఆంక్షలు విధించడం వల్ల రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు చెప్పారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కార్యాలయానికి అందజేయనున్నట్లు కార్యదర్శి కుమార్ తెలిపారు.

ఆరోగ్య ఫార్మారంగాల్లో ఫార్మాసిస్ట్‌లది కీలక పాత్ర



గుంటూరు రూరల్: ఆరోగ్య ఫార్మా పరిశ్రమల రంగాల్లో ఫార్మాశిస్ట్‌లది కీలక పాత్రని నాట్కో ఫార్మా లిమిటెడ్ హెచ్‌ఆర్ మేనేజర్ డాక్టర్ పి.రంజిత్‌కుమార్ తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మశీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫార్మాస్యూటికల్ పరిశ్రమల్లో కేరీర్ అవకాశాల అన్వేషణ అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ పరిశ్రమ ప్రపంచంలోని అత్యంత పోటీతత్వ, డైనమిక్ రంగాల్లో ఒకటని తెలిపారు. ఫార్మశీ డైనమిక్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్ అని తెలిపారు. ఈ రంగంలో ప్రతి స్థాయిలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ తాజా ఫార్మశీ గ్రాడ్యుయేట్‌లు కెరీర్ మార్గం విభిన్నంగా అన్వేషించాలన్నారు. కళాశాల అధ్యాపకులు తదితరులు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు.